సాక్షి సూర్యాపేట

బుధవారం ; 11 ; జూన్ ; 2025



నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

ఇంజన్‌లో సాంకేతిక లోపంతో జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నల్లగొండ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది.

- 8లో



బాలుడి కిడ్నాప్

నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం బాలుడు(20 నెలలు) కిడ్నాప్‌కు గురయ్యాడు.

- 8లో



నకిలీ విత్తన ముఠా అరెస్టు

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠాను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ నర్సింహ తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



రత్నవరంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నడిగూడెం : భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. మంగళవారం నడిగూడెం మండలం రత్నవరంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎలాంటి భూ సమస్యలు ఉన్నా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రత్నవరంలో 113 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, నడిగూడెం తహసీల్దార్ వి.సరిత, ఆర్ఐ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కళ్యాణి, రెవెన్యూ సిబ్బంది సుకేష్, భూమేష్, రాజు, శరత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటసుబ్బారావుకు నివాళి



నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు

భానుపురి (సూర్యాపేట) : భారత జాతీయ ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు జయంతిని మంగళవారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారావు చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.శ్యాంసుందర్ రెడ్డి, లైబ్రేరియన్లు ఎంపీ రంగారావు, డి.లలితాదేవి, కె.విజయ భాస్కర్, పి.సృజన పాల్గొన్నారు.

పంట మార్పిడితో రైతులకు మేలు



తొండ గ్రామంలోని రైతు వేదికలో మాట్లాడుతున్న డాక్టర్ సతీష్ చౌహాన్

తిరుమలగిరి : పంట మార్పిడితో రైతులకు మేలు కలుగుతుందని భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చౌహాన్, కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ సూచించారు. మంగళవారం తొండ గ్రామంలోని రైతు వేదికలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టి సారించాలన్నారు. రైతులు శాస్త్రీయంగా వ్యవసాయం చేస్తే ఆదాయం పెరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ప్రణీత, వెంకట్‌రెడ్డి, అవినాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఎస్పీ నరసింహ, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది

యోగాతో ఒత్తిడి తగ్గుతుంది

సూర్యాపేటటౌన్ : రోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని ఎస్పీ కె.నరసింహ సూచించారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న యోగశిక్షణ తరగతులకు మంగళవారం ఆయన హాజరై సిబ్బందితో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల మానసికంగా స్థిరంగా ఉంటారని, మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. మనసు నిశ్చలంగా ఉంటే పనిపై ధ్యాస ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

- విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా బదిలీలు
- జూలై 15లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- వివరాలు సేకరిస్తున్న జిల్లా విద్యాశాఖ
- జిల్లాలో 3,790 మంది ఉపాధ్యాయులు



సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతను తీర్చేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. జూలై 15వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సమీప బడుల నుంచి సర్దుబాటు చేయనున్నారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్న నేపథ్యంలో ఒక్కో పాఠశాలలో విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? ఉపాధ్యాయుల సంఖ్య ఎంత తదితర వివరాలను ఎంఈఓల ద్వారా సేకరిస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య ఇలా..	
ఎస్టీజీలు	1,693
స్కూల్ అసిస్టెంట్‌లు	1,787
జీహెచ్ఎంలు	160
ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు	150

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండాల్సిన టీచర్లు

విద్యార్థుల సంఖ్య	టీచర్లు
1నుంచి 10	ఒకరు
11 నుంచి 60	ఇద్దరు
61 నుంచి 90	నలుగురు
91 నుంచి 120	ఐదుగురు
121 నుంచి 150	ఐదుగురు
151 నుంచి 200	ఆరుగురు

జిల్లాలో 950 పాఠశాలలు..

3790 మంది ఉపాధ్యాయులు..

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 950 ఉన్నాయి. వీటిలో 182 జెడ్పీఉన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 690 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 70వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 3,790 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ

ప్రతి పాఠశాలలో సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయుల కొరత ఉండకుండా చూడాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తిస్తున్నారు. జిల్లాలోని 23 మండలాల పరిధిలోని ఎంఈఓల ద్వారా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలు సేకరిస్తున్నారు. ఈ వివరాలు సేకరణ పూర్తి కాగానే సర్దుబాటు చేయనున్నారు.

విద్యార్థుల చేరికల తర్వాత చేస్తే..

పాఠశాలలు పునఃప్రారంభంనాటికి సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలని తొలుత విద్యాశాఖ భావించింది. అయితే ఈనెల 6 నుంచి బడిబాట నిర్వహిస్తున్నందున స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యపెరుగుతుందని అందువల్ల పాఠశాలలు పునఃప్రారంభం కాగానే టీచర్లను సర్దుబాటు చేస్తే ప్రయోజనం ఉండదని ఉపాధ్యాయ సంఘాలు ఈ ప్రక్రియను వ్యతిరేకించాయి. దీంతో సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసే గడువును జూలై 15వరకు పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఎక్కువ మంది విద్యార్థులు ఉండి తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలకు తక్కువ మంది విద్యార్థులు ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న స్కూళ్ల నుంచి బదిలీ చేయనున్నారు. గతంలో మండల స్థాయిలో సర్దుబాటు చేసినా ఉపాధ్యాయులు వెళ్లకపోవడంతో సమస్యలు ఏర్పడ్డాయి. ఈసారి కలెక్టర్ నుంచి ఉత్తర్వులిప్పించాలని నిర్ణయించారు. విద్యార్థుల చేరికల తర్వాత సర్దుబాటు చేస్తే బాగుంటుందని టీచర్లు అంటున్నారు.

కొన్ని పాఠశాలల్లో ఇలా..

- తుంగతుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో 11 మంది విద్యార్థులు ఉండగా ఆరుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.
- మునగాల మండలం నారాయణగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో 16 మంది విద్యార్థులకుగాను ఎనిమిది మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.
- హుజూర్‌నగర్ మండలం అమరవరం ఎంపీపీఎస్‌లో 114 మంది విద్యార్థులు ఉండగా నలుగురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు.
- చిలుకూరు మండలం జేరిపోతులగూడెం ఎంపీపీఎస్‌లో 101 మంది విద్యార్థులు ఉండగా కేవలం ముగ్గురు ఉపాధ్యాయులే ఇక్కడ పని చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం సర్దుబాటు చేస్తాం

ప్రభుత్వ నిబంధనల మేరకు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. బడి బాట ద్వారా విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా పని చేస్తున్నాం. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం వివరాలు సేకరిస్తున్నాం. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే సర్దుబాటు చేస్తాం. విద్యార్థులకు నాణ్యమైన, ఉత్తమ బోధన అందించేందుకు కృషి చేస్తాం. -అశోక్, డీఈఓ

ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీళ్లు

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని ప్రతి రెవెన్యూ గ్రామం, గ్రామపంచాయతీలే కాకుండా ఆవాస ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీటి వసతి కల్పించినట్లు కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. నేషనల్ జల జీవన్ మిషన్ అమలుపై మంగళవారం ఢిల్లీ నుంచి డ్రింకింగ్ వాటర్ – శానిటేషన్ సెక్రటరీ అశోక్ కే.మీనా తెలంగాణలోని 16 జిల్లాల కలెక్టర్లు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ అన్ని పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీటిని సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.క్రమం తప్పకుండా నీటి నాణ్యత పరిశీలిస్తున్నామని, జిల్లాలో తొమ్మిది వాటర్ ట్రీట్‌ప్లాంట్స్ ఉన్నాయని, క్షేత్రస్థాయిలో తాగునీటి నాణ్యత పరిశీలించేందుకు ప్రతి గ్రామపంచాయతీలో టెస్టింగ్ కిట్స్ ఉన్నాయని చెప్పారు. డీడబ్ల్యూఎస్ఎం (డ్రింకింగ్ వాటర్ శానిటేషన్ మిషన్)పై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో పీఎం గతి శక్తి ద్వారా 5,404 కిలోమీటర్లు పైప్‌లైన్ మంజూరైందని, ఇప్పటికే 2,538 కిలోమీటర్ల మేర పనులు పూర్తయినట్లు చెప్పారు. 552 మంది నల్ జల్ మిత్ర (గ్రామ మంచినీటి సహాయకులు)లను ఇప్పటికే నియమించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీపీఓ యాదగిరి, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు నాగేశ్వరరావు, అరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



హాస్పిటల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

చివ్వెంల(సూర్యాపేట): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. హాస్పిటల్ రికార్డులు పరిశీలించి, సిబ్బంది వివరాలను వైద్యాధికారి అనిషాను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది చేస్తున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మందులు కావాలంటే వైద్య సిబ్బంది ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిషా, ల్యాబ్ టెక్నీషియన్ రేవతి, స్టాఫ్‌నర్సు రమాదేవి పాల్గొన్నారు.

15న ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ ప్రమాణస్వీకారం



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్యులు

హుజూర్‌నగర్ : కోదాడలో ఈనెల 15న ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి భవన్‌లో ఆర్యవైశ్య మహాసభ పట్టణ, మండల సమావేశం నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభకు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు మాశెట్టి అనంత రాములు, సంఘం నాయకులు బి.రామారావు, వి.నరసింహా రావు, పి.లక్ష్మీనరసింహారావు, బి.రాజా, వి.నాగేశ్వరరావు, పి.అశోక్, జి.విద్యాసాగర్, ఇ.కోటేశ్వరరావు, డి.నరసింహమూర్తి, కె.పాపారావు, వి.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు, రామ్‌నరేష్, ఆంజనేయులు, నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణ, నరసింహారావు అయ్యప్ప పాల్గొన్నారు.

ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది పక్కదారి పడుతోందని, నియంతృత్వ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల నుంచి వ్యతిరేకత పెరుగుతోందన్నారు. దీంతో ప్రజలు ఆందోళలు, పోరాటాల బాట పడుతున్నారని చెప్పారు. ప్రజలు కదిలితే అరెస్టులు చేసి పోలీసు స్టేషన్‌లో పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో సీపీఎం .. ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు.

ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఉగ్రదాడి

భారతదేశం ఆర్థిక వ్యవస్థలో ఐదో స్థానంలో ఉంటే మోదీ ప్రభుత్వం నాలుగో స్థానంలో ఉందని గొప్పలు చెప్పుకుంటోందని ఎద్దేవా చేశారు. పహల్గాంలో ప్రభుత్వ వైఫల్య కారణంగానే ఉగ్ర దాడి జరిగిందనేది స్పష్టంగా అర్థమవుతోందని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి జరుగుతుందని ఇంటలీజెన్స్ ద్వారా ప్రభుత్వానికి ముందే తెలుసని అందుకే ప్రధాని మోదీ తన పర్యటన రద్దు చేసుకున్నారని ఆరోపించారు. కాల్పుల విరమణ అనేది పాకిస్తాన్, భారత దేశానికి సంబంధించిందని, ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ప్రకటన చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, పోలిశెట్టి యాదగిరిరావు, నాగారపు పాండు, ములకలపల్లి రాములు, కోట గోపి, పల్లె వెంకటరెడ్డి, పాండు నాయక్, దుగ్గి బ్రహ్మం, యాకూబ్, వి. సైదులు, పి. హుస్సేన్, శ్రీలం శీను, బాలు నాయక్ పాల్గొన్నారు.

రైతు నేస్తం.. సాగుకు ఉపయుక్తం

- అధిక దిగుబడులు సాధించేలా రైతు నేస్తం కార్యక్రమాలు
- ఇప్పటికే 23 రైతువేదికల్లో కేంద్రాలు ఏర్పాటు
- తాజాగా మరో 46 కేంద్రాలు మంజూరు



వర్ధమానుకోట రైతునేస్తం కేంద్రంలో సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు(ఫైల్)

నాగారం : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతునేస్తం పేరుతో సాగులో మెళకువలు, సలహాలు, సూచనలు అందించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. పంట ఉత్పత్తులను పెంచే విధంగా నిపుణులు సలహాలు, సూచనలిస్తారు. అన్ని గ్రామాల రైతులు కార్యక్రమానికి హాజరై వీక్షించవచ్చు. మొదటి విడతగా మండలానికి ఒకటి చొప్పున 23 రైతు నేస్తం కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం హైదరాబాద్ నుంచి పలువురు శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయాధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆధునిక వ్యవసాయ విధానాలతోపాటు సస్యరక్షణపై సలహాలిస్తున్నారు. ఈ విధానం రైతులకు ప్రయోజనకరంగా ఉండడంతో మరిన్ని రైతు నేస్తం కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈనేపథ్యంలో అధికారుల ప్రతిపాదనల మేరకు తాజాగా కొత్తగా మండలానికి రెండు చొప్పున 46 కేంద్రాలు మంజూరయ్యాయి. వీటిని ఏర్పాటు చేసే ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంపిక చేసిన రైతు వేదికల్లో సామగ్రి అమర్చాల్సిఉంది.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా..

జిల్లాలోని 486 పంచాయతీల పరిధిలో 82 క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించి వాటి ద్వారా పలురకాల సలహాలు ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించే విధంగా

లక్ష్యాలివే..


రైతునేస్తం ద్వారా కర్షకులకు అధికారులు పలురకాల ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. జిల్లాకు మంజూరైన రైతునేస్తం యూనిట్లను రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తారు. బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సాయంతో దృశ్య, శ్రవణ విధానం కొనసాగుతుంది. వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పిస్తారు. రైతునేస్తం నిర్వహణ మొత్తం ఏఈఓలకు అప్పగించారు. టీవీ, బ్యాటరీ తదితర విలువైన పరికరాలు కేంద్రాల్లో ఉంటాయి.

రైతుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో రైతునేస్తం ఒకటి. దృశ్య, శ్రవణ సేవల విస్తరణకు వ్యవసాయంతో పాటు దానికి అనుబంధంగా ఉండే ఉద్యాన, మత్స్య, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, నీటి పారుదల శాఖలకు సంబంధించి సలహాలు అందిస్తున్నారు.

సందేహాల నివృత్తికి..

జిల్లాలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఎరువుల యాజమాన్యం, వంగడాల ఎంపిక, కలుపు నివారణ, అధిక వర్షాల వేళ పంటల వారీగా తీసుకోవాల్సిన చర్యలు, సస్యరక్షణ చర్యలు వివరిస్తున్నారు. చిరుధాన్యాలు, వాణిజ్య పంటలు, కూరగాయల సాగు విధానాలను రైతులు అడిగి తెలుసుకొని, సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. కాలానుగుణంగా పశువులకు అందించాల్సిన టీకాల పై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు వచ్చే రాయితీలు, దరఖాస్తు విధానాలను వివరిస్తున్నారు. తాజాగా మరిన్ని రైతు నేస్తం కేంద్రాలను విస్తరించడంతో మరింత మంది రైతులకు సేవలు అందుబాటులోకి వచ్చే ఆస్కారముంది.

సద్వినియోగం చేసుకోవాలి



రైతు నేస్తం వేదికల్లో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యాన, పశు సంవర్ధక శాఖ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో కార్యక్రమానికి హాజరయ్యే రైతుల అన్నిరకాల సందేహాలు నివృత్తి అవుతున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన 46 గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తానికి సంబంధించిన ఎల్రక్టానిక్ పరికరాలను ఏర్పాటు చేయిస్తున్నాము.

– జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఉద్యాన రైతులకు ఊతం

- 2025-26 వార్షిక ప్రణాళిక ఖరారు
- ఈ ఏడాది ఆయిల్‌పామ్ లక్ష్యం 3వేల ఎకరాలు
- సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద రూ.216.86 లక్షలు కేటాయింపు
- ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



సూర్యాపేటలో మామిడి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి

సూర్యాపేట : ఉద్యాన పంటల సాగుకు ఊతం ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే పండ్లు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించాయి. ఈ మేరకు వివిధ పథకాలకు సంబంధించి 2025-26 వార్షిక ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఖరారు చేసింది. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లాకు రూ.2429.34 లక్షలను వివిధ పంటల సాగుకు కేటాయించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. గడిచిన మూడేళ్లలో 4,885 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగయ్యేలా జిల్లా రైతాంగానికి వివిధ రాయితీలు ప్రకటించింది. ఆయిల్‌పామ్ దిగుబడి వస్తే కొనుగోలుకు జిల్లాకు పతంజలి కంపెనీని కేటాయించారు. ఈ ఏడాది దాదాపు 3వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేయించాల్సి ఉంది. దీనికి రైతులకు రాయితీ కింద రూ.1759.37 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంది.

సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం

సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయల, పూల సాగుతో పాటు నీటికుంటల ఏర్పాటుకు ఆసక్తి గల రైతులను ప్రోత్సాహించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.216.86 లక్షలు కేటాయించింది.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఇలా..

తీగ జాతి కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా శాశ్వత పందిళ్లను రాయితీపై ఇవ్వనున్నారు. ఈ పథకం కింద 2025-26 సంవత్సరానికి రూ.50 లక్షలతో 100 యూనిట్ల శాశ్వత పందిళ్లను నిర్మించనున్నారు. ఒక్కో యూనిట్‌కు 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఒక్క రైతు 5 యూనిట్ల వరకు రాయితీ పొందే అవకాశముంది.

దరఖాస్తు చేసుకోవాలి



2025-26 సంవత్సరానికి ఉద్యాన పంటల సాగు లక్ష్యాన్ని ఖరారు చేశారు. ఆసక్తి గల రైతులు ఆయా డివిజన్ ఉద్యాన అధికారులకు దరఖాస్తు అందించాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – నాగయ్య, జిల్లా ఉద్యాన అధికారి

డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం..

సూక్ష్మ నీటి పారుదల పథకం కింద డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను ఇవ్వనున్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకున్న రైతులు భూమి , నీరు, విద్యుత్ వసతులు కలిగి ఉండాలి.

విత్తు పడింది



మృగశిర కార్తె ప్రారంభంకావడంతో మంగళవారం మోతె మండలం రావిపహాడ్‌లో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు -మోతె

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి కేసులో నలుగురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్

చివ్వెంల(సూర్యాపేట): వ్యక్తిపై దాడి చేసి గాయ పర్చిన నలుగురిని మంగళవారం పోలీసులు రిమాండ్ చేశారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన ధరావతు అశోక్‌పై గత నెల 23వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గ్రామ శివారులోని లక్ష్మీనగర్ టౌన్‌షిప్‌లో దాడి చేశారు. దీంతో అశోక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన అల్లకుంట్ల రాము, ఓర్సు కేశవ, ఇద్దరు మైనర్లను మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ కనకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

గరిడేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన గుండు మహేష్(36) గత కొన్నేళ్లుగా కీతవారిగూడెంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు ఇటీవల పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో పిల్లల చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తితో మంగళవారం ఉదయం తన భార్య షాపు వద్దకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య సంధ్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విహారయాత్రకు వద్దన్నారని..

యాదగిరిగుట్ట: విహారయాత్రకు వెళ్లేందుకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదని మనస్తాపంతో ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం జరిగింది. వివరాలు.. యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన గంగాధార్ భరత్(17) ఇంటర్ ఫస్టియర్ పూర్తిచేసుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం విహారయాత్రకు వెళ్తానని తల్లిదండ్రులను అడిగాడు. ఇల్లు కట్టుకోవడానికే డబ్బులు లేవు.. ఇప్పుడు టూర్‌కు ఎందుకని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన భరత్ ఇంటి వెనుక గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి భువనగిరి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే భరత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ భాస్కర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నకిరేకల్: మద్యం మత్తులో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని అరెంపుల గ్రామానికి చెందిన వల్లూరు భూపాల్‌రెడ్డి(52)కి నకిరేకల్ మండలం మండలాపురం గ్రామానికి చెందిన జానకితో వివాహమైంది. గతేడాది నుంచి భూపాల్‌రెడ్డి మండలాపురంలో తన అత్తగారింట్లోనే భార్యతో కలిసి ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు(కవల పిల్లలు) ఉన్నారు. మద్యానికి బానిసైన భూపాల్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన తన అత్తగారి నిమ్మతోటకు వెళ్లాడు. మద్యంలో మత్తులో తోటలో గడ్డి మందు తాగాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చి తాను గడ్డి మందు తాగానని కుటుంబ సభ్యులతో చెప్పాడు. అప్పటికే అపస్మారకస్థితిలోకి వెళ్లిన భూపాల్‌రెడ్డిని కుటుంబ సభ్యులు వెంటనే నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రిష్ణమాచారి తెలిపారు.

నకిలీ విత్తనాల ముఠా అరెస్టు

- రూ.65లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటటౌన్ : నకిలీ పత్తి విత్తనాలను రైతులకు విక్రయిస్తున్న అరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట ఎస్పీ కె. నర్సింహ తెలిపారు. వారి నుంచి రూ.65 లక్షల విలువ గల 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసు వివరాలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ బస్ స్టేజీ వద్ద ఈ నెల 9న సీసీఎస్ పోలీసులు, ఆత్మకూర్(ఎస్) పోలీసులు సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన తండా నగేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడు 120 ప్యాకెట్ల నకిలీ విత్తనాలను గోనె సంచిలో పెట్టుకొని ని బైక్‌పై వెళ్తుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. నగేష్.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన పంది రాము వద్ద విత్తనాలు తెస్తున్నట్లు ఒప్పుకున్నాడు. పంది రామును అతని గ్రామంలో అదుపులోకి తీసుకొని విచారించగా.. ఎన్టీఆర్ జిల్లా మైలవరం గ్రామంలో బానోతు జయరాం షాపులో కొనుగోలు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అలాగే జయరాం షాపునకు గుంటూరు జిల్లా బాలాజీనగర్‌కు చెందిన తరిగొప్పుల శ్రీనివాసరావు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో జయరాంను, శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని విచారించగా.. బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన మాగులూరి సాంబశివరావు అనే వ్యక్తి అరుణోదయ అనే నకిలీ పత్తి విత్తన కంపెనీ నిర్వహిస్తూ విత్తనాలు తయారు చేస్తున్నాడు. తరిగొప్పుల శ్రీనివాసరావు మధ్యవర్తిగా ఉంటూ కర్నూలు జిల్లా పల్లిపాడు గ్రామానికి చెందిన చెవుల నర్సింహులుతో సరఫరా చేస్తున్నట్లు తేలింది. జయరాం షాపులో నిల్వచేసిన 37 బస్తాల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకోగా ఈ బస్తాలో ఒక్కొక్క దానిలో 120 ప్యాకెట్లు నకిలీ విత్తనాలు ఉన్నాయి. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న విత్తనాల విలువ సుమారు రూ.63 లక్షలు ఉంటుందని ఎస్పీ వివరించారు. ఈ కేసులో తండ నగేష్, పంది రాము, బాణోతు జయరాం, తరిగొప్పుల శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా.. ఏ-1 అయిన అరుణోదయ నకిలీ పత్తి విత్తనాల కంపెనీ ఎండీ మాగులూరి సాంబశివరావు, ఏ-6 చెవుల నర్సింహులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మరో కేసులో ఇద్దరు అరెస్టు

ముందస్తు సమాచారం మేరకు సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన వెలుగు శ్రీను అనే వ్యక్తి ఇంట్లో ఈ నెల 9న జిల్లా సీసీఎస్, మోతె పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అతని ఇంట్లో అడ్వాన్స్ 333, అరుణోదయ అనే నకిలీ పత్తి విత్తనాల కంపెనీల పేరుతో ఉన్న 98 ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి విచారించగా.. శ్రీను బంధువైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన చర్లపల్లి శాతవాహన అనే వ్యక్తితో కలిసి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ రైతులకు ఈ నకిలీ విత్తనాలు అమ్ముతున్నామని ఒప్పుకున్నాడు. వెంటనే శాతవాహన అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 30 ప్యాకెట్ల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరికి ఈ విత్తనాలు సరఫరా చేస్తున్న మరో వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నలుగునూర్‌కు చెందిన తిరుమల్‌గా గుర్తించారు. ప్రస్తుతం తిరుమల్ పరారీలో ఉండగా అతనిని పట్టుకునేందుకు పోలీస్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో రూ.2లక్షల విలువ చేసే 58 కేజీల నకిలీ విత్తాలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో బాగా పని చేసిన సిబ్బందిని అభినందించారు. విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీసీఎస్ సీఐ శివకుమార్, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, ఆత్మకూరు ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



నకిలీ విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, పోలీసు సిబ్బంది

రేపు పోచంపల్లికి గవర్నర్ రాక

- ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లికి గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేనేత జౌళిశాఖ రాష్ట్ర అధికారులతో కలిసి స్థానిక టూరిజం పార్కుతో పాటు సమీపంలోని చేనేత కార్మికుల గృహాలను సందర్శించారు. టూరిజం పార్కులో చేనేత వస్త్రాల తయారీ విధానాలను గవర్నర్ పరిశీలించనున్న నేపథ్యంలో పార్కులో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా టూరిజం పార్కులోని కాన్ఫరెన్స్ హాల్‌లో చేనేత కార్మికులు, కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలతో గవర్నర్ ముఖాముఖి నిర్వహించనుండడంతో అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. చేనేత బీమా, త్రిఫ్ట్ పథకం చెక్కులను గవర్నర్ లబ్ధిదారులకు అందజేయనున్న నేపథ్యంలో ఎంపిక చేసిన పోచంపల్లి, కుంట్లగూడేనికి చెందిన చేనేత కార్మికులకు సమాచారం ఇచ్చి వారు సకాలంలో కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గవర్నర్ చేనేత కార్మికుల గృహాలను సైతం సందర్శించి మగ్గాలను ప్రత్యక్షంగా పరిశీలించి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకొంటారని.. దీంతో టూరిజం పార్కు సమీపంలో ఉన్న చేనేత కార్మికులైన భారత భాస్కర్, భారత మధు, పొట్టబత్తిని శేఖర్ ఇళ్లను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, మున్సిపల్, చేనేత జౌళిశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, ఇందుమతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లాఏడీ శ్రీనివాస్‌రావు, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, జౌళిశాఖ అభివృద్ధి అధికారి రాజేశ్వర్‌రెడ్డి, చేనేత నాయకులు తడక రమేశ్, భారత లవకుమార్, అంకం పాండు, ఏలే భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



టూరిజం పార్కులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

గవర్నర్ పర్యటన ఇలా..

గురువారం ఉదయం 10.45 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పోచంపల్లికి చేరుకుంటారు. 11.15 వరకు చేనేత గృహాల సందర్శన, 11.15 నుంచి 11.30 గంటలకు టూరిజం పార్కును సందర్శించి పార్కులో చేనేత వస్త్ర తయారీ ప్రక్రియను పరిశీలిస్తారు. 11.30 నుంచి మధ్యాహ్నం 12గంటలకు చేనేత కార్మికులతో ముఖాముఖి సమావేశం ఉంటుంది. మధ్యాహ్నం 12.15 వరకు చేనేత కార్మికులకు బీమా, త్రిఫ్ట్ ఫండ్ చెక్కుల పంపిణీ చేస్తారు. అనంతరం 12.15 గంటల తర్వాత గవర్నర్ తిరిగి రాజ్‌భవన్‌కు పయనమవుతారు. అయితే గవర్నర్ పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో బాలుడి కిడ్నాప్

- ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం బాలుడు(20 నెలలు) కిడ్నాప్‌కు గురయ్యాడు. పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ గ్రామానికి చెందిన బైరం భాగ్యలక్ష్మి, అంజిబాబు దంపతులకు మొదటి కాన్పులో కుమారుడు సోమేష్ కుమార్(20 నెలలు) జన్మించాడు. భాగ్యలక్ష్మి ఈ నెల 8న రెండో కాన్పు కోసం కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. మంగళవారం మధ్యాహ్నం భాగ్యలక్ష్మితో పాటు ఆమె కుమారుడు సోమేష్‌కుమార్, బంధువులు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట గల చెట్టు కింద సేదతీరారు. అప్పటికే ఇద్దరు మహిళలు భాగ్యలక్ష్మితో పాటు ఆమె బంధువులతో పరిచయం పెంచుకున్నారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత భాగ్యలక్ష్మి తన కుమారుడు సోమేష్‌కుమార్‌ను తనకు పరిచయమైన ఇద్దరు మహిళల వద్ద ఉంచి కాన్పుల వార్డుకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి కుమారుడు, ఇద్దరు మహిళలు కనిపించలేదు. దీంతో భాగ్యలక్ష్మి, ఆమె బంధువులు ఆస్పత్రి మొత్తం వెతికినా సోమేష్‌కుమార్ ఆచూకీ లభించకపోవడంతో నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. భాగ్యలక్ష్మికి ఇంకా రెండో కాన్పు కాలేదు.

నాలుగు బృందాలతో గాలింపు..

నల్లగొండ: బాలుడి ఆచూకీ కనిపెట్టేందుకు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలతో నాలుగు టీంలను ఏర్పాటు చేసి బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. అంతేకాకుండా డీఎస్పీ తన సిబ్బందితో ప్రభుత్వాస్పత్రికి వెళ్లి సీసీ కెమెరాల పుటేజీని సేకరించారు. జిల్లా వ్యాప్తంగా బస్సులు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు.



కిడ్నాప్‌కు గురైన సోమేష్‌కుమార్



సీసీ కెమెరాల్లో రికార్డయిన మహిళ

భువనగిరిలో కనిపించిన కిడ్నాపర్లు

భువనగిరిటౌన్: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కిడ్నాప్ అయిన బాలుడితో పాటు ఇద్దరు మహిళలు భువనగిరి బస్టాండ్ ఆవరణలో సంచరించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. వారు బస్టాండ్ నుంచి బయటకు వచ్చి యాదగిరిగుట్ట వైపు వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ మహిళలు భువనగిరి బస్టాండ్‌లో కొన్ని వస్తువులు కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఫోన్ పే నంబర్ ఆధారంగా కిడ్నాప్ అయిన బాలుడితో సహా ఆ ఇద్దరు మహిళలను భువనగిరి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళలిద్దరు యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూర్, ఆత్మకూర్ మండలాలకు చెందిన వారిగా సమాచారం. అయితే కిడ్నాపర్ల కోసం గాలిస్తున్నామనే భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి



సిద్దు (ఫైల్)

డిండి: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం డిండి మండలం నగారాదుబ్బతండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగారాదుబ్బతండాకు చెందిన కరంటోతు చంద్రు, బుజ్జి దంపతుల కుమారుడు సిద్ధు(13) నాగరకర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ అక్కడే ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్వగ్రామంలోనే ఉంటున్న సిద్ధు సోమవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన నలుగురి స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలోని మెట్టన్‌కుంట వద్దకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో సిద్ధు ప్రమాదవశాత్తు కుంటలో పడి మునిగిపోయాడు. అతడి స్నేహితులు నలుగురు భయంతో అక్కడి నుంచి చేరుకున్నారు. కానీ సిద్ధు నీటి కుంటలో పడిపోయిన విషయం ఎవరికీ చెప్పలేదు. రాత్రయినా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో సిద్ధు తల్లిదండ్రులు గ్రామంలో ఎక్కడ వెతికినా అతడి ఆచూకీ దొరకలేదు. మంగళవారం తెల్లవారుజామున సిద్ధు వెంట వెళ్లిన స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న అతడి తల్లిదండ్రులు, తండావాసులు మెట్టన్‌కుంటలో వెతకగా సిద్ధు మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సిద్ధు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి చంద్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా నుంచి అతివేగంగా వస్తున్న కారు నల్లగొండ నుంచి ఎస్ఎల్‌బీసీ వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడేనికి చెందిన వంశీ (22) అక్కడికక్కడే మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన బైక్ నడుపుతున్న రుద్రాక్షి తిలక్ స్వల్పంగా గాయపడ్డాడు. వీరు పేటీఎం కంపెనీలో పనిచేస్తున్నారు. కారు బైక్‌ను ఢీకొట్టిన తర్వాత పక్కనే ఉన్న ఫాస్ట్‌పుడ్ సెంటర్‌లోకి దూసుకెళ్లింది ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులు అప్రమత్తమై తప్పించుకోవడంతో వారికి ప్రాణపాయం తప్పింది. ఈ ఘటనలో కారు టైరు పేలిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారులో ఉన్న వ్యక్తులు ఏపీలోని శ్రీకాకుళంకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



సురేందర్ (ఫైల్)

గుర్రంపోడు: రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్న కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం తెరాటిగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. తెరాటిగూడెం గ్రామానికి చెందిన నారబోయిన సురేందర్(20) రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. సోమవారం కూడా సురేందర్ మద్యం తాగి ఇంటికి రావడంతో.. ఆరోగ్యం దెబ్బతింటుందని తల్లిదండ్రులు నారబోయిన అచ్చమ్మ, మల్లయ్య మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సురేందర్ ఇంట్లో నుంచి వెళ్లిపోయి తమ బత్తాయి తోట లో పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల రైతులు గమనించి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు కాంస్య పతకం



ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు

నల్లగొండ టూటౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు కాంస్య పతకం గెలుచుకుంది. మంగళవారం ఉమ్మడి జిల్లా జట్టుకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంస్య పతకం, ట్రోఫీ అందజేశారు. హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఇమాం కరీం క్రీడాకారులకు అభినందించారు.

ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

బీబీనగర్: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని అంకుశాపూర్ పరిధిలో గల ప్రిన్స్‌టన్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను అడ్మిషన్ల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పాసైన మహిళా అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ మెమో, బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు 2025 జనవరి తర్వాత పొందిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించాలని సూచించారు. ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజెడ్‌సీ, బీజెడ్‌సీ, బీకాం, సీఏ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7995010687, 7981199283 నంబర్లను సంప్రదించాల ప్రిన్సిపాల్ సూచించారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

- లైన్ సిగ్నల్ లేక ఫలక్‌నూమా..
- నల్లగొండ రైల్వే స్టేషన్‌లో గంటకు పైగా నిలిచిన రెండు రైళ్లు



నల్లగొండ రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైళ్లు

రామగిరి(నల్లగొండ): సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఇంజన్‌లో మంగళవారం సాంకేతిక లోపం ఏర్పడింది. నల్లగొండ రైల్వే స్టేషన్‌కు రైలు ఉదయం 9.10 గంటలకు వచ్చింది. అదే సమయంలో ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తి అక్కడే ఆగిపోయింది. అప్పటికే ప్లాట్‌ఫాం మీదకు వచ్చిన హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నూమా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అధికారులు నిలిపివేశారు. సిబ్బంది మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. రెండు రైళ్లు సుమారు గంటకు పైగా నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో రైలు ఇంజన్‌ను తెప్పించి జన్మభూమి రైలును పంపించారు. ఆ వెంటనే ఫలక్‌నూమా రైలు కూడా వెళ్లింది. 10.20 గంటలకు రెండు రైళ్లు కదిలాయి. సుమారు గంటకు పైగా ప్రయాణికులు అనేక అవస్థలు పడ్డారు.

నేడే ఏరువాక పౌర్ణమి

- వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు



హాలియా, రామన్నపేట: తొలకరి జల్లులు.. రైతన్నల మోములో చిరునవ్వు.. పుడమి తల్లి పులకరింతకు సాక్ష్యమే ఏరువాక పౌర్ణమి. ప్రతి ఏడాది వైశాఖ మాసం ముగిసి జ్యేష్ఠ మాసం మొదలైన తర్వాత వర్షాలు కురవడం మొదలవుతాయి. జ్యేష్ఠ పౌర్ణమి నాటికి తొలకరి వర్షాలు పడి భూమి మెత్తబడుతుంది. దీంతో రైతులు దుక్కులు దున్నడం, వ్యవసాయ పనులను ఏరువాకతోనే మొదలుపెడతారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కథనం.

ఏరువాక అంటే..


ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ నాడు జరుపుకునే వేడుకనే ఏరువాక అంటారు. ఏరు అంటే ఎద్దులను నాగలికి కట్టి దున్నడానికి సిద్ధం చేయడం అని అర్థం. ఈ రోజు రైతులు కాడెద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు పూసి, మెడలో గజ్జెలు, గంటలతో అలంకరిస్తారు. ఎడ్లకు కట్టే కాడిని పూజించి, ఎద్దులకు భక్షాలు తినిపిస్తారు. పొలాలకు వెళ్లి భూతల్లికి పూజలు చేసి దుక్కి దున్నడం ప్రారంభిస్తారు. తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాల మధ్య వ్యవసాయ పనులు మొదలు పెడతారు.



ఏరువాక పౌర్ణమి నేపథ్యం..

ఏరువాకను జ్యోతిష్య శాస్త్రవేత్తలు కష్యారంభం, సస్యారంభం అని వ్యవహరిస్తారు. భారతదేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఏరువాక పౌర్ణమి జరుపుకుంటారు. జ్యేష్ఠ మాసంలో ప్రారంభమయ్యే నైరుతి రుతుపవనాల ప్రభావం అంతటా ఒకేలా ఉంటుంది. 80శాతం వర్షం నైరుతి రుతుపవనాల వల్లనే కలుగుతుంది. దీంతో పొలం పనులకు ఆటంకం కలగవద్దని, పంటలు సమృద్ధిగా పండాలని రైతులు ఏరువాకను మహా యజ్ఞంగా పరిగణించి ఆచరిస్తారు. రామాయణంలో నాగేటి సాళ్లల్లో సీతమ్మ అమ్మవారు దొరికింది కాబట్టి సీతా యజ్ఞంగా కూడా భావిస్తారు. ఇదే రోజున ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి స్నానోత్సవం కూడా నిర్వహిస్తారు. అదేవిధంగా పూర్వం శ్రీకృష్ణదేవరాయల వారు తన పాలనా కాలంలో ఏరువాక పండుగ రోజున రైతుల శ్రమ, కృషిని గుర్తించి తగిన రీతిలో రైతులను ప్రోత్సహించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అంతేకాకుండా ఇదే రోజున శుద్ధోదన రాజు కపిలవస్తులో లాంఛనంగా ఏరువాకను ప్రారంభించి బంగారు నాగలిని రైతులను బహూకరించినట్లు పురాణ కథలు చెబుతున్నాయి.


వ్యవసాయం బాగా అభివృద్ధి చెందింది



ఆధునిక పరిజ్ఞానం పెరగడం, యంత్రాలను విరివిగా ఉపయోగించడం, ప్రభుత్వం వివిధ రూపాల్లో తగిన ప్రోత్సాహం అందించడం వల్ల కొంతకాలంగా వ్యవసాయరంగం బాగా అభివృద్ధి చెందింది. పంటల దిగుబడి గణనీయంగా పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో రైతులకు చాలా మేలు జరుగుతుంది. వివిధ రంగాల్లో స్థిరపడిన వారి దృష్టి సైతం వ్యవసాయం వైపు మళ్లింది.

– కూనూరు రమేష్ రైతు సిరిపురం, రామన్నపేట


ఏరువాకతో దున్నడం ప్రారంభిస్తాం



ఏరువాక పౌర్ణమి రోజు మా ఊర్లో రైతులందరం కలిసి వ్యవసాయ పనిముట్లు, భూదేవికి, ఎద్దులకు పూజలు చేస్తాం. అనంతరం నాగళ్లు కట్టి దుక్కులు దున్నడం ప్రారంభిస్తాం. వర్షాలు అనుకున్నట్లు పడితే ఈ ఏడాది వ్యవసాయ సాగుకు ఎలాంటి ఢోకా ఉండదు.

– అనుముల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, త్రిపురారం

ఈ ఏడాది ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నాం



2025-26 వ్యవసాయ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు డీలర్ల వద్ద, పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉన్నాయి. మెట్ట పంటలు సాగు చేసే రైతులు 60 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిన తర్వాతే పత్తి, కంది సాగు చేయాలి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి మంచి దిగుబడులు వచ్చి రైతులకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

– డి. గోపాల్, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయాధికారి